క్లుప్తంగా

రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

సబ్బవరం: మండలంలోని గాలిభీమవరం ఆర్యభట్ట పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన రక్తదాన శిబిరంతో పాటు ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. సూర్య మల్టీ స్పెషాలిటీ కేర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అలాగే ఫస్ట్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు రక్తదానం చేశారు.

వరహాలరెడ్డికి ఘన నివాళి



వరహాలరెడ్డికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సింహాచలం: ఇటీవల మృతిచెందిన వైఎస్సార్ సీపీ నగర కార్యదర్శి మద్ది వరహాలరెడ్డి పార్టీకి అందించిన సేవలను నాయకులు కొనియాడారు. అడవివరంలోని ఓ కల్యాణ మండపంలో శుక్రవారం 98వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు ఆధ్వర్యంలో సంతాప సభ నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు కొంతసేపు మౌనం పాటించి వరహాలరెడ్డికి నివాళులర్పించారు.

విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్యసమావేశం రేపు

పరవాడ: స్థానిక మరిడిమాంబ కల్యాణ మండపంలో ఆదివారం విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నామని ఆ సంఘం జనరల్ కార్యదర్శి వి.వి.దీక్షితులు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని విశ్రాంత ఉద్యోగులంతా పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు, డెంటల్ క్లీనిక్ ఆధ్వర్యంలో దంత పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. విశ్రాంత ఉద్యోగులంతా ఆధార్ కార్డు, సెల్ ఫోన్ వెంట తీసుకు రావాలని కోరారు.

ప్రకృతి సేద్యాన్ని పరిశీలించనున్న బృందం

సబ్బవరం: మండలంలోని అమృతపురం గ్రామంలో సాగు చేస్తున్న ప్రకృతి సేద్యాన్ని రిటైర్డ్ ఐఏఎస్ విజయ కుమార్‌తో పాటు సత్య త్రిపాఠి బృందం శనివారం పరిశీలించనుంది. ఈ మేరకు శుక్రవారం అనకాపల్లి డీపీఎం సీహెచ్ లచ్చన్న ఒక ప్రకటనలో తెలిపారు. క్షేత్ర పరిశీలన అనంతరం గ్రామ సచివాలయంలో రైతులు, మహిళా సంఘాలతో సమావేశం నిర్వహించి ప్రకృతి వ్యవసాయ సాగులో భాగంగా అమలు జరుగుతున్న కార్యక్రమాలను సమీక్షించనున్నారు. అదేవిధంగా రసాయన వ్యవసాయం చేసే రైతులకు ప్రకృతి సాగుపై సమగ్రంగా అవగాహన కల్పించనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

సింహాచలం: ఎల్‌టీ లైన్ల నిర్వహణ కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ సుజాతనగర్ ఈఈ బోకం రవి తెలిపారు. చిన ముషిడివాడ రిజిస్ట్రార్ కార్యాలయం ఏరియా, ఎస్సీ, బీసీ కాలనీలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

పాడి పశువులకు టీకాలు



గొటివాడలో ఆవుకు టీకా వేస్తున్న పశుసంవర్ధక శాఖ సిబ్బంది

సబ్బవరం: మండలంలోని గొటివాడ గ్రామంలో శుక్రవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ నెల 30వ తేదీ వరకూ మండలంలోని అన్ని ఆవులు,గేదెలకు టీకాలు వేయనున్నారు. ఈ అవకాశాన్ని పాడి రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు కోరారు. కార్యక్రమంలో ఆరిపాక వెటర్నరీ డాక్టర్ స్వర్ణలత, గొటివాడ జేవీవో కె. రమణారావుతో పాటు పంశుసంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి

- వైభవంగా నారసింహుడికి ఆర్జిత సేవలు
- పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు
- భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



నిత్యకల్యాణంలో జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు



సింహగిరిపై కోలాటం ఆడుతున్న మహిళలు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. దీంతో కొండపై ఆధ్యాత్మిక భావం ఉప్పొంగింది. ఉదయం నుంచి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు స్వర్ణ తులసీ దళార్చన నిర్వహించారు. శ్రీ స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను ఆలయ కల్యాణమండపంలోని వేదికపై అధిష్టంపజేసి 108 స్వర్ణ తులసీ దళాలతో స్వామికి అష్టోత్తరశతనామావళి పూజ చేశారు. అర్చకుడు అప్పాజీ తదితరులు పూజ నిర్వహించగా ఆలయ ఇన్‌స్పెక్టర్ సిరిపురపు కనకరాజు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కమనీయం.. కల్యాణం

వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు నిత్యకల్యాణం కమనీయంగా జరిగింది. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ అలంకారి పురోహిత్ కరి సీతారామాచార్యులు తదితరులు ఈసేవని ర్వహించారు.

➽ ఏకాదశి పురస్కరించుకుని ఆలయ కల్యాణ మండపంలో పండితులు సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు.

విశేషంగా తిరువీధి

ఏకాదశి పురస్కరించుకుని సింహగిరిపై తిరువీధి విశేషంగా జరిగింది. మదనగోపాలస్వామి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి పల్లకిలో అధిష్ఠంపజేసి సాయంత్రం సింహగిరి మాడవీధుల్లో తిరువీధి నిర్వహించి హారతులు అందజేశారు. మహిళల కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.



సామూహిక విష్ణుసహస్రనామ పారాయణ చేస్తున్న పండితులు



స్వర్ణ తులసీ దళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, సిబ్బంది

సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా విస్తృత ప్రచారం



95వ వార్డులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్, కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: ఈనెల 13న జరిగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ కోరారు. 95వవార్డులోని లక్ష్మీపురం, గవరపాలెం, దుర్గానగర్, పోర్టుకాలనీ, మారుతీనగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రి వై ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో బరిలో ఉన్న సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. విశాఖ పరిపాలన రాజధాని అయితే పెద్ద ఎత్తున యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో 95వవార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యూత్ జనరల్ సెక్రటరీ మనలత జోబ్‌దాస్, కాళ్ల దేవి వెంకట గంగాధర్, యువజన విభాగం అధ్యక్షుడు చిప్పల చందు తదితరులు పాల్గొన్నారు.

➽ 93వ వార్డులోని ప్రహ్లాదపురం, పల్లినారాయణపురంలో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దాసరి రాజు పట్టభద్రుల ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. నాయకులు వినోద్, శ్రీకాంత్, రఘు, కనకరాజు, నక్క శ్రీను పాల్గొన్నారు.

➽ జీవీఎంసీ 98వవార్డులో వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొలుసు ఈశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు అడవివరంలోని ప్రియాగార్డెన్స్, వరాహ పుష్కరిణి మార్గంలో విస్తృతంగా ప్రచారం చేశారు. పట్టభద్రులను కలిసి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేయాలని కోరారు. అడవివరం కోఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు కర్రి అప్పలస్వామి,నాయకులు ఎర్ర వరహా నరసింహం, పీతల అప్పలరాజు, లంక సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రావాడలో..

పరవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు పిలుపునిచ్చారు. రావాడ శివారు ధర్మారాయుడుపేటలో వైఎస్సార్‌సీపీ బలపర్చిన అభ్యర్థి సుధాకర్‌కు మద్దతుగా శుక్రవారం పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బంధం నాగేశ్వరరావు, సచివాలయ కన్వీనర్ కావలి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాల మధ్య వివాదం

- ఒకరికి తీవ్ర గాయాలు
- రాయపుర అగ్రహారంలో ఘటన

సబ్బవరం: మండలంలోని రాయపుర అగ్రహారం గ్రామంలో గురువారం రాత్రి ఇరువర్గాల మధ్య నెలకొన్న వివాదం కొట్లాటకు దారితీసింది. దీంతో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు ఇరువర్గాలకు చెందిన నలుగురు వ్యక్తులపై సబ్బవరం పోలీసులు కేసు నమోదు చేశారు.ఎస్‌ఐ అల్లు వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు.. గురువారం రాత్రి గ్రామానికి చెందిన నంబారు అప్పలనాయుడు ఇంటికి వస్తుండగా అదే గ్రామానికి చెందిన బందం పెంటారావు,నంబారు సన్యాసిరావు, నంబారు పరదేశి పాత కక్షల నేపథ్యంలో వివాదానికి దిగి కొట్టారని నంబారు అప్పలనాయుడు భార్య ఎర్నికుమారి శుక్రవారం పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది.తన భర్త ప్రస్తుతం కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడని, తలకు 8 కుట్లు పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా తన సెల్ ఫోన్ లాక్కొని నంబారు అప్పలనాయుడు రోడ్డుకు వేసి కొట్టడంతో పగిలిపోయిందని, తన సెల్ ఇప్పించాలని బందం పెంటారావు ఫిర్యాదు చేశారు.ఇరువర్గాల ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వైరల్ జ్వరాల కట్టడికి చర్యలు

- జిల్లా మలేరియా అధికారి వరహాలుదొర
- తానాం గురుకుల పాఠశాల సందర్శన



గ్రామ పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి వరహాలుదొర

పరవాడ: వైరల్ ఫీవర్స్‌తో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు జరిపి జ్వరాలను అరికట్టడానికి తక్షణ చర్యలు చేపట్టాలని అనకాపల్లి జిల్లా మలేరియా అధికారి వరహాలుదొర స్థానిక వైద్యాధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం తానాం రెసిడెన్సియల్ పాఠశాలను సందర్శించి వైరల్ జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన మందులు అందించి జ్వరాలు తగ్గు ముఖం పట్టే విధంగా చూడాలన్నారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో కాలువలు, చెత్తా చెదారాల తొలగించడానికి పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మురుగు కాలువలు, అపరిశుభ్ర ప్రదేశాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో దోమల నివారణ కోసం మందులు పిచికారీ చేయించాలన్నారు. విష జ్వరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారులకు వరహాలుదొర సూచించారు. ఆయన వెంట తానాం సర్పంచ్ కన్నూరిదేవి వెంకటరమణ, పరవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ఐ.ఆర్.రంజిత్, మలేరియా సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి ఆలయంలో శుక్రవారం క్షీరాభిషేక సేవ ఘనంగా నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ సేవలో 20 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే క్షీరాభిషేక సేవలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించాలని ఈవో కె.శిరీష తెలిపారు. భక్తులు 0891-2566514, 89855 15989 నంబర్లలో సంప్రదించాలన్నారు.

పైడిమాంబ దర్శనానికి పోటెత్తిన భక్తులు



అమ్మవారి దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు



పైడిమాంబకు పూజలు చేస్తున్న భక్తులు

ఆరిలోవ: జాతీయ రహదారిని ఆనుకుని డెయిరీ ఫారం వద్ద 14 గ్రామాల ఇలవేల్పు పైడిమాంబ జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఇందిరానగర్, డెయిరీఫారం, ఆదర్శనగర్, ఎస్‌ఐజీ నగర్, రవీంద్రనగర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి పోటెత్తారు. ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. ఈ నెల 7న జరగనున్న అమ్మవారి జాతర కోసం ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

వినికిడి సమస్యలున్న పిల్లలకు వైద్య సేవలు



మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్

మహారాణిపేట: వినికిడి సమస్యలున్న పిల్లలకు అవసరమైన వైద్య సేవలు కేజీహెచ్‌లో అందిస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. ప్రపంచ వినికిడి దినోత్సవంలో భాగంగా జిల్లా రాష్ట్రీయ బాల స్వస్త కార్యక్రమం ఆధ్వర్యంలో శుక్రవారం కేజీహెచ్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్‌లో ఏడేళ్లలో 70 మంది పిల్లలకు కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీలు జరిగాయన్నారు. 116 మంది పిల్లలకు హియరింగ్ ఎయిడ్స్ పరికరాలు అందించామని చెప్పారు. కేజీహెచ్ పిల్లల విభాగాధిపతి డాక్టర్ బి.చక్రవర్తి మాట్లాడుతూ స్పీచ్ థెరపీ ద్వారా ఎందరో పిల్లలు లబ్ధి పొందారని తెలిపారు. జిల్లా రాష్ట్రీయ బాల స్వస్త కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ సమత మాట్లాడుతూ పుట్టుక నుంచి 18 ఏళ్ల లోపు పిల్లలకు పుట్టుకతో వచ్చే సమస్యలు, ఎదుగుదల లోపాలను గుర్తించి తగిన చికిత్స అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఆడియాలజిస్ట్ కమ్ స్పీచ్ థెరపిస్ట్ పి.కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం వెళ్లి పెన్షన్ అందజేత



శాంతమ్మకు పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ ధనలక్ష్మి

పెదగంట్యాడ: వలంటీర్ విధి నిర్వహణలో శభాష్ అనిపించుకుంది. తన క్లస్టర్ పరిధికి చెందిన ఓ వృద్ధురాలు ఊరు వెళ్లడంతో, అక్కడికి వెళ్లి పెన్షన్ సొమ్ము అందజేశారు. వివరాలివి.. జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని నీలాపువీధిలో కె.శాంతమ్మ (79) నివాసం ఉంటున్నారు. ఆమెకు ప్రతి నెలా వలంటీర్ ధనలక్ష్మి పెన్షన్ అందజేస్తున్నారు. అయితే శాంతమ్మ ఇటీవల రాజమహేంద్రవరం సమీపంలోని పిడుంగొయ్యి గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఆమె అక్కడి నుంచి సమయానికి రాలేకపోవడంతో, వలంటీర్ అక్కడికి వెళ్లి ఆమెకు పెన్షన్ అందజేశారు. దీంతో లబ్ధిదారు ఎంతో ఆనందం వ్యక్తం చేశారు.

750వ రోజుకు ఉక్కు దీక్షలు



దీక్షలో పాల్గొన్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 750వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు కూర్చుని, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని వెనక్కి తీసుకునే వరకు వివిధ రీతుల్లో ఉద్యమాన్ని కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వరంగ సంస్థల జోలికి వస్తే కార్మికులు చూస్తూ ఊరుకోరన్నారు. కేంద్ర ప్రభుత్వం తన నిర్ణయాలను మార్చుకోవాలని హెచ్చరించారు.

‘దినచర్యలో తత్వశాస్త్ర అధ్యయనం భాగం’



ప్రొఫెసర్ రజనిని సత్కరిస్తున్న ఆచార్య నరసింహారావు

ఏయూ క్యాంపస్: తత్వశాస్త్ర అధ్యయనం మానవుడి దినచర్యలో భాగం కావాలని ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు అన్నారు. ఏయూ తత్వశాస్త్ర విభాగంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫిలాసఫీ రీసెర్చ్ న్యూఢిల్లీ సహకారంతో ‘భారతీయ సంస్కృతికి అరవిందుని దృక్పథం’ అనే అంశంపై శుక్రవారం నిర్వహించిన ఉపన్యాస కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం నరసింహారావు మాట్లాడుతూ ధ్యానం ఒక సాధనంగా చేసుకుంటే మానవులు తమను తాము అర్థం చేసుకోవడం సాధ్యపడుతుందన్నారు. ప్రపంచంలో ఏ దేశానికి లేని తాత్విక సంపద భారత్‌కు ఉందన్నారు. దీనిని పొందడం కోసం ప్రపంచ దేశాలు భారతీయ సంస్కృతిపై ఆసక్తి చూపిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రధాన ఉపన్యాసకురాలు, ఐసీపీఆర్ సీనియర్ ఫెలో రిటైర్డ్ ప్రొఫెసర్ ఆచార్యులు కె.ఆర్. రజిని మాట్లాడుతూ సమస్యలను అధిగమించడానికి పూర్ణ యోగాను ప్రజలంతా అలవాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తత్వశాస్త్ర విభాగాధిపతి ఆచార్య వానపల్లి వెంకటరావు, విశ్రాంత ఆచార్యులు ఎం.వి.కృష్ణయ్య, ఆచార్య రవి బాబు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల వేలం నేడు

మద్రిపాలెం: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(సెబ్) మురళీనగర్ వద్ద ఉన్న గోపాలపట్నం సర్కిల్-4లో ఈ నెల 4న ద్విచక్ర వాహనాల వేలం వేయనున్నట్టు సెబ్ సీఐ సీహెచ్‌వీఎస్ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. మురళీనగర్ ఎన్‌ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలోని సెబ్ స్టేషన్ లో ఉదయం 11 గంటలకు వివిధ ఎక్సైజ్ నేరా ల్లో పట్టుబడిన వాహనాల వేలంపాట ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు పాల్గొనవచ్చని ఆయన కోరారు.

బాలికల సంరక్షణపై అవగాహన ర్యాలీ

మహారాణిపేట: భేటీ బచావో-భేటీ పడావో కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మహారాణిపేట వద్ద మొదలైన ఈ ర్యాలీ జబ్బర్‌తోట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వరకు జరిగింది. ఈ నెల 1న మొదలై 8వ తేదీ వరకు జరగనున్న కార్యక్రమంలో భాగంగా ర్యాలీ చేశారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరమనే అంశంపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక శాఖాధికారి డాక్టర్ ఎస్.జీవన్ రాణి, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు, జిల్లా రాష్ట్రీయ బాల స్వస్త కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ సమత, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులపై గ్యాస్ ధరల భారం



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు, ఆటో డ్రైవర్లు

సీతంపేట: కేంద్ర ప్రభుత్వం పెంచిన వంట గ్యాస్ ధరలను వెంటనే రద్దు చేయాలని సీపీఐ నాయకుడు జి.వామనమూర్తి డిమాండ్ చేశారు. సీపీఐ ఆధ్వర్యంలో శుక్రవారం అక్కయ్యపాలెం 80 ఫీట్ రోడ్డులో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే వంద రోజుల్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని హామీ ఇచ్చిందని, ఏడున్నరేళ్లు దాటినా ఆ ఊసెత్తకుండా ప్రధాని మోదీ ప్రజలను మోసం చేశారన్నారు. ఇంధన, నిత్యావసర సరకుల ధరలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజలపై ఆర్థిక భారాలు వేస్తూ, గుజరాత్ రాష్ట్రానికి చెందిన మోదీ గ్రూప్‌నకు రూ.10 లక్షల కోట్ల రూపాయల రాయితీలు కల్పించారని విమర్శించారు. పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆటో డ్రైవర్లు, ముఠా కలాసీలు, భవన నిర్మాణ కార్మికులు గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలని నినాదాలు చేశారు. సీపీఐ నాయకులు అబ్దుల్ రజాక్, కాండ్రేగుల రాము, బి.రాము, పి.సాయి, ఎ.కృష్ణ, పి.ప్రసాద్, సూరిబాబు, పి.జయలక్ష్మి, రణబీర్ సింగ్ పాల్గొన్నారు.

‘ఆహారపు అలవాట్ల వల్లే ఊబకాయం’



డాక్టర్ చలపతిరావు ఆచంట

అక్కిరెడ్డిపాలెం: పిల్లల ఆహారపు అలవాట్ల వల్లే ఊబకాయం వస్తుందని షీలానగర్ కిమ్స్ ఐకాన్ కన్సల్టెంట్ మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ చలపతిరావు ఆచంట అన్నారు. మార్చి 4న అంతర్జాతీయ ఊబకాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆస్పత్రిలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దాదాపు 14.4 మిలియన్ల స్థూలకాయ పిల్లలతో భారతదేశం ప్రపంచంలోనే రెండో స్థానంలో ఉందన్నారు. పిల్లల్లో శారీరక శ్రమ లేకపోవడం, ఆటలకు దూరంగా ఉండటం, కేలరీలు, కొవ్వు అధికంగా ఉండే ఆహారం తీసుకోవడం, శరీరంలో అధిక కొవ్వు పేరుకు పోవడం ఊబకాయానికి ప్రధాన కారణాలని చెప్పారు. టీవీ చూస్తూ భోజనం చేయడం, టిఫిన్ మానేయడం, చక్కెర తీపి పానీయాలు తీసుకోవడం, తరచూ బయట పదార్థాలు తినడం, జంక్ ఫుడ్, క్యాలరీలు అధికంగా ఉండే పదార్థాలు తినడం వల్ల ఒబేసిటీ వస్తుందని చెప్పారు. పోషకాహారం తీసుకోవడం, ప్రతీ రోజు వ్యాయామం చేయడం, ఆటలాడటం, టీవీ తక్కువగా చూడటం వల్ల ఊబకాయానికి చెక్ పెట్టవచ్చని వివరించారు.

వన్యప్రాణుల సంరక్షణ బాధ్యత అందరిది



జూలో పక్షులను తిలకిస్తున్న విద్యార్థులు

ఆరిలోవ: వన్యప్రాణుల సంరక్షణను అందరూ బాధ్యతగా తీసుకోవాలని జూ ఇన్‌చార్జి క్యూరేటర్ అనంత శంకర్ కోరారు. ఇందిరాగాంధీ జూ పార్కులో శుక్రవారం వన్యప్రాణి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో పలు కళాశాలలకు చెందిన విద్యార్థులు జూ పార్కును సందర్శించారు. వారంతా జూ లోపల వాక్‌థాన్ నిర్వహించి వివిధ రకాల పక్షులను పరిశీలించారు. వాటిని సెల్‌ఫోన్లు, కెమెరాలలో బంధించారు. మధ్యాహ్నం తోటగరువు ఉన్నత పాఠశాల విద్యార్థులకు వన్యప్రాణులపై అనంత్ శంకర్ అవగాహన కల్పించారు. పర్యావరణంలో ఉన్న వన్యప్రాణుల వైవిధ్యం మానవ మనుగడకు కీలకమన్నారు.